సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం ၊ 15 ၊ సెప్టెంబర్ ၊ 2023



సకాలంలో పంట రుణాలివ్వాలి

పోడుపట్టాలు పొందిన రైతులకు సకాలంలో పంట రుణాలివ్వాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. IIలో▸



సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె

సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. గురువారం దీక్ష శిబిరాల్లోనే పొలాల పండుగ జరుపుకొని నిరసన తెలిపారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

చెవిలో పూలతో నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 17వ రోజుకు చేరింది. పొలాల పండగ రోజు కూడా ఉద్యోగులు చెవిలో పూలతో నిరసన చేపట్టారు. డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేదాకా పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు పార్థసారథి, ప్రకాశ్, ధరమ్‌సింగ్, రమేశ్, అతుల్, శ్రీకాంత్, సజ్జన్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె విరమణ



డీఎంహెచ్‌వోకు లేఖ ఇస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో పట్టణ ఆరోగ్య కేంద్రాల ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు 11 రోజులుగా చేపట్టిన సమ్మె గురువారం విరమించారు. సమస్యల పరిష్కారానికి వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. తాము విధుల్లో చేరుతున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు లేఖ అందజేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో మరోసారి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

సమ్మె నోటీసు అందజేత



కలెక్టర్‌కు నోటీసు ఇస్తున్న ఆశ కార్యకర్తలు

కైలాస్‌నగర్: తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశ కార్యకర్తలు తెలిపారు. గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను తన కార్యాలయంలో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు మాట్లాడారు. తమ వేతనాన్ని రూ.18 వేలకు పెంచడంతో పాటు కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు.

షెడ్యూల్ విడుదల చేయాలి



పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: జీవో 3ను యథావిధిగా అమలు చేయాలని, గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని టీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్ మాట్లాడారు. గిరిజన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐటీడీఏ పీవోకు వివరించినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు జాదవ్ రవీందర్, బలిరాం, రాథోడ్ ప్రవీణ్ తదితరులున్నారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

కైలాస్‌నగర్: 'ఓటు.. ప్రజాస్వామ్యంలో దాని ప్రాముఖ్యత' అనే అంశంపై ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లు నమ్మొద్దు

ఆదిలాబాద్‌టౌన్: ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లను ఎవరూ నమ్మవద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫేక్ అకౌంట్లను గుర్తిస్తే ఫేస్‌బుక్‌లో బ్లాక్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్పీ పేరిట ఒక ఫేస్‌బుక్ అకౌంట్ యాక్టివ్‌లో ఉండగా దానిని జిల్లా పోలీసులు గుర్తించి బ్లాక్ చేసినట్లు తెలిపారు. ఫేక్ అకౌంట్లకు స్పందించవద్దని, వారు డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు.



తాంసి హనుమాన్ ఆలయం వద్ద బసవన్నలతో రైతులు



బసవన్నకు నైవేద్యం సమర్పిస్తున్న రైతు కుటుంబం



తలమడుగు మండలం సుంకిడిలో బసవన్నలను ఊరేగింపుగా తీసుకువస్తున్న రైతు

ఘనంగా పొలాల పండుగ

పొలాల అమావాస్య పండుగను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. రైతులు బసవన్నలను అందంగా అలంకరించి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. ఆలయాల చుట్టూ తిప్పి ఇంటిల్లిపాది పూజలు చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం సమర్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

తాంసిలోని రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు



వీరు మారరు..!

ఇది తాంసి మండల కేంద్రంలోని ఓ రియల్ ఎస్టేట్ కొత్త లేఅవుట్.. దీంట్లో విద్యుత్ సరఫరా కోసం అనేక స్తంభాలు వేసి వైర్లు కూడా బిగించారు. ఈ పనులన్నీ విద్యుత్‌శాఖ నుంచి అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయి. ఇచ్చోడ సబ్ డివిజన్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నాడు. ఆదిలాబాద్‌రూరల్ సబ్ డివిజన్ పరిధిలోకి వచ్చే తాంసిలో పక్కనున్న సబ్ డివిజన్‌కు చెందిన కాంట్రాక్టర్‌తో పనులు చేయించడం వెనుక పెద్ద మతలబే దాగి ఉంది. విద్యుత్‌శాఖలో కొంతమంది అధికారులు ఇలా బినామీ కాంట్రాక్టర్ల ద్వారా ఇలాంటి అనధికారిక పనులు నిర్వహించడం ద్వారా సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అంతే కాకుండా



తాంసి లేఅవుట్‌లో ఇప్పటికే వేసిన విద్యుత్ స్తంభాలు, బిగించిన వైర్లు విద్యుత్‌శాఖకు చెందినవేననే ఆరోపణలున్నాయి. గుడిని, గుడిలో లింగాన్ని మింగిన చందంగా కాంట్రాక్టర్లు సంస్థకు రావాల్సిన ఆదాయానికి బొక్క పెడుతూనే వనరులను కూడా వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్ల బాగోతం
- పెద్దసార్లే వెనుకున్నట్లు ఆరోపణలు
- ఇష్టారీతిన చేపడుతున్న పనులు
- సంస్థ సామగ్రి అక్రమ వినియోగం
- జీఎస్టీ ఎగవేత.. ఐటీకి పంగనామం
- చోద్యం చూస్తున్న అధికారగణం

సాక్షి, ఆదిలాబాద్: తాంసిలో రూపొందిస్తున్న లేఅవుట్‌లో విద్యుత్ సరఫరా కోసం ఆ యజమాని సంబంధితశాఖకు దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు దరఖాస్తును పరిశీలించి అంచనా వ్యయం రూపొందించాలి. ఒకవేళ రూ.10 లక్షల వరకు అంచనా విలువ ఉంటే జిల్లా స్థాయిలోనే ఎస్ఈ మంజూరు చేయాలి. ఆపై ఉంటే వరంగల్ సీఎండీ ద్వారా అనుమతులు పొందాలి. శాఖాపరంగా మంజూరు ఇస్తే కన్జుమర్ అందుకు సంబంధించి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సంస్థ పరంగా ఈ పనులు చేపట్టేందుకు అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. దాంట్లో ఏ కాంట్రాక్టర్ అయితే తక్కువ వ్యయంతో పనులు చేపడతానని ముందుకు వస్తారో.. అతడికి పనులు అప్పగించాలి. ఆ తర్వాత వర్క్ ఆర్డర్ జారీ అవుతుంది. తదుపరి పనులు ప్రారంభించాలి. అయితే ఈ లేఅవుట్‌కు సంబంధించి అసలు దరఖాస్తు విషయంలో కూడా అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేదు. ఒకవేళ అన్ని అనుమతులతో పనులు చేపట్టి ఉంటే సంస్థకు పర్యవేక్షణ చార్జీల కింద ఆదాయం లభించేది. అలా వర్క్ చేపట్టి ఉంటే పని దక్కించుకున్న కాంట్రాక్టర్ స్తంభాలు, తీగలు సామగ్రిని ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దాని ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో ఆదాయం లభిస్తుంది. తాంసిలో అనధికారికంగా పనులు చేయడం, సంస్థకు సంబంధించిన విద్యుత్ సామగ్రినే ఉపయోగించడంతో ఇక్కడ సామగ్రి కొనుగోలు జరగలేదన్న విమర్శలు వస్తున్నాయి. తద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున జీఎస్టీ రూపంలో బొక్కపెట్టినట్లే. ఇక సెస్ రూపంలోనూ ప్రభుత్వానికి నష్టమే. అంతే కాకుండా ఈ పనులపై అంచనా వ్యయం రూపొందించి ఉంటే దాని విలువ ఆధారంగా ఆదాయ పన్ను (ఐటీ) చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని కూడా ఇక్కడ ఎగ్గొట్టినట్లే. ఇలా అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి తమ జేబులు నింపుకొంటూ విద్యుత్ సంస్థ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

అయినా డోంట్ కేర్..

విద్యుత్‌శాఖలో ఎన్ని అక్రమాలు జరిగి వెలుగులోకి వస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఇక్కడి అధికారులకు పైనున్న ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఉండటమేనన్న విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. గతనెల 25న అనుమతి లేకుండానే కరెంట్ పనులు ఇష్టారీతిన జరుగుతున్నాయనే విషయంపై 'సాక్షి' వార్తా కథనం ప్రచురించింది. జిల్లా కేంద్రంలోని ఓ రియల్ వెంచర్‌లో ఈ పనులు జరుగుతున్నట్లు వివరించింది. ఈ విషయం ఉన్నతాధికారుల వరకూ వెళ్లింది. కాగా, తాజాగా తాంసి వెంచర్‌లో ఇలా అనధికారికంగా పనులు చేపట్టడం విస్మయానికి గురిచేస్తోంది. ఇక్కడి అధికారులే ఇవన్ని వెనుకుండి నడుపుతున్నారనే ఆరోపణలు బాహాటంగా వ్యక్తమవుతున్నాయి. పైనున్న సత్సంబంధాలతో ఎలాంటి అక్రమాలు జరిగినా 'డోంట్‌కేర్' అనే రీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ లేఅవుట్‌లో కరెంట్ అక్రమాల విషయంపై బయట ప్రచారం జరుగుతుండటంతో ప్రస్తుతం సంబంధిత అధికారులు ఆ తప్పును కప్పిపుచ్చే యత్నం చేస్తున్నారు.

పాత పనులకు కొనసాగింపుగానే..

తాంసిలో ఇదివరకు చేపట్టిన ఒక పనికి సంబంధించి ఎక్స్‌టెన్షన్‌గా లేఅవుట్‌లో పనులు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అయితే దానికి సంబంధించి పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నాం.

– హరికృష్ణ, డీఈ (ఆపరేషన్) విద్యుత్‌శాఖ

'విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు'



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: విధులను నిర్లక్ష్యం చేసే వైద్యులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యశాఖ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని రిమ్స్, కమ్యూనిటీ, ప్రాథమిక ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వానాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రుల వారీగా హైరిస్క్ కేసుల వివరాలపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలను మెడికల్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజాసంక్షేమం'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

ఇచ్చోడ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కర్ణాటక ఎమ్మెల్సీ, పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాశ్ రాథోడ్ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అభినందన్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే నేటికీ కొనసాగుతున్నాయని వివరించాలని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాలపల్లి శ్రీధర్, నాయకులు అడే గజేందర్, జాలైజాకు, నరేశ్‌జాదవ్, వన్నెల అశోక్, కుంర కోటేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్‌ఖాన్ పాల్గొన్నారు.

అధికసంఖ్యలో కార్యకర్తలను తరలించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించనున్న బహిరంగసభకు ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు లక్ష్యానికి అనుగుణంగా కార్యకర్తలను తరలించాలని కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ కోరారు. మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మి గార్డెన్స్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నవారితో విడివిడిగా సమావేశమయ్యారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు అల్లూరి సంజీవరెడ్డి, బొరంచు శ్రీకాంత్‌రెడ్డి, భార్గవ్ దేశ్‌పాండే, అంబకంటి అశోక్, శంతన్‌రావ్, సంజయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గుడిపెల్లి నగేశ్, శ్రీధర్, చరణ్‌గౌడ్, వసీం, రూపేశ్ రెడ్డి, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులున్నారు.

ముత్నూర్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్, అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామపంచాయతీ రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 అవార్డుకు ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లోని టీఎస్ ఐఆర్డీలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ తుమ్రం బాగుబాయి, ఎంపీడీవో పుష్పలత, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ జైస్వాల్, జిల్లా స్థాయి అధికారులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి, అధికారులు సర్పంచ్ బాగుబాయిని సన్మానించారు.

'నల్లబ్యాడ్జీలతో విధులకు రావాలి'



మాట్లాడుతున్న గడుగు నరేందర్

ఎదులాపురం: జిల్లాలో పని చేస్తున్న ఎస్జీటీలు ఈనెల 16న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని ఎస్జీటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గడుగు నరేందర్ తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన ప్రకారం పీఎస్ హెచ్‌ఎంలను ఈసారి ప్రమోషన్లలో భర్తీ చేసేదాకా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రతీ ఎస్జీటీయూ ఉపాధ్యాయుడు నల్ల బ్యాడ్జీ ధరించి విధులకు హాజరుకావాలని కోరారు. తదుపరి నిర్వహించాల్సిన కార్యక్రమాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. పీఎస్ హెచ్‌ఎంలను సాధించుకునే దాకా అలుపెరుగని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర కమిటీ తీర్మానించిందని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాల్ల ఆకాశ్, కార్యదర్శి గంగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేడు 33 కేంద్రాల్లో పరీక్షలు
- పేపర్–1కు 7,716 మంది..
- పేపర్–2కు 3,124 మంది అభ్యర్థులు
- వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న శ్యామలాదేవి

ఆదిలాబాద్‌టౌన్: శుక్రవారం నిర్వహించనున్న టెట్‌కు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పరీక్షకు 10,840 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పేపర్–1 ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనుండగా 7,716 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్న పేపర్–2 పరీక్ష 3,124 మంది రాయనున్నారని తెలిపారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగే పరీక్షకు 33 కేంద్రాలు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 14 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అభ్యర్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

ప్రతిఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

ఎదులాపురం: హిందీ జాతీయ భాష అని, ప్రతి ఒక్కరూ దీనిని నేర్చుకోవాలని ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ (ఇంజినీర్) నాషి నాయక్ సూచించారు. హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రంలోని నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతీ సంవత్సరం ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంలో సెప్టెంబర్ 14నుంచి 29వ తేదీ వరకు హిందీ భాష పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హిందీ సరళమైన భాష అని, దీని మాధుర్యాన్ని తెలుసుకోవాలని కోరారు. అనంతరం హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారి వివరాలు ప్రకటించారు. ఆకాశవాణి ముఖ్య కార్యక్రమాధికారి కే రామేశ్వర్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రిమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడబ్ల్యూవో మిల్కా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని విద్యార్థుల వివరాలతో https:// telanganae pass. cgg. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఈ నెల 30వ తేదీలోపు జిల్లా సంక్షేమాధికారి, మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ కార్యాలయంలో అందించాలని, పూర్తి వివరాలకు 08732222058 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈ–కేవైసీ తప్పనిసరి



ఈ–కేవైసీ ప్రక్రియ పరిశీలిస్తున్న శ్యామలాదేవి

కైలాస్‌నగర్: రేషన్‌కార్డులో పేరు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌చౌక్‌లోగల చౌకధరల దుకాణాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సరుకుల పంపిణీ, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డుదారులతో మాట్లాడి బియ్యం పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబూసింగ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

రేపు జిల్లా, జోనల్ స్థాయి రెజ్లింగ్ సెలక్షన్స్

నిర్మల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ జిల్లా, జోనల్ స్థాయి (ఉమ్మడి ఆదిలాబాద్) అండర్ 14, 17 సెలక్షన్లు శనివారం భైంసా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. భైంసాలోని వేదం తపోవన్ స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం నిర్వహణ కార్యదర్శి నఫీఖాన్‌ను సెల్ నం.9440957385లో సంప్రదించాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


లింగమ్మ(ఫైల్)

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు లడేవార్ లింగమ్మ(103) గురువారం మృతిచెందింది. లింగమ్మకు ఆరుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. కోడళ్లు, మనుమళ్లు, మునిమనవలు మొత్తం 152 మంది కుటుంబ సభ్యులున్నారు. వందేళ్లు దాటినా.. ఆమె తనపని తానే చేసుకునేదని కుటుంబీకులు పేర్కొన్నారు. వయస్సు సహకరించకపోవడంతో గురువారం తుదిశ్వాస విడిచింది.

గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని చిట్యాల్, లక్ష్మీసాగర్‌లో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈదాడుల్లో 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలోనూ పట్టుబడిన షేక్ సల్మా, బానావత్ గంగుబాయిలను తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది రశీద్‌ఖాన్, గౌతం, భాస్కర్, హరిశ్, కల్పన ఉన్నారు.

ఆర్టీసీలో ఆన్‌లైన్ చెల్లింపులు

- అందుబాటులోకి రానున్న ఐ టీం మెషిన్లు
- ప్రయాణికులకు సులువు కానున్న చెల్లింపులు
- చిల్లర సమస్యకు చెక్..



భైంసాటౌన్: ప్రయాణికులను ఆకట్టుకునేందుకు టీఎస్‌ఆర్టీసీ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. కొత్త బస్సులు అందుబాటులోకి తేవడంతో పాటు టికెట్లపై రాయితీలు అందిస్తోంది. మహిళా ప్రయాణికులను ఆకర్షించే దిశగా టీ9, టీ30 టిక్కెట్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. పండుగల సందర్భాల్లో లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు సైతం అందిస్తోంది. తద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ ఓఆర్ శాతం పెంచుకుంటోంది. తాజాగా ప్రయాణికులకు మరో శుభవార్త అందించింది. ఇకపై బస్సుల్లో ఆన్‌లైన్ పేమెంట్స్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. చిల్లర సమస్యకు చెక్ పెట్టేందుకు బస్సుల్లో ప్రయాణికులు టికెట్ కోసం ఆన్‌లైన్ పేమెంట్ చేసే అవకాశం కల్పించనుంది. ఇందుకోసం ఐటీమ్స్ పరికరాలను బస్సుల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు.

తీరనున్న చిల్లర సమస్య...

ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ చెల్లింపుల హవా నడుస్తోందంటే అతిశయోక్తి కాదు. పొద్దున పూట పాలు మొదలు, కూరగాయలు, పండ్లు, కిరాణ, నిత్యావసర సరుకులు.. ఇలా కూరగాయల కొట్టు మొదలు సూపర్‌మార్కెట్ వరకు సరుకుల కొనుగోలుకు దాదాపు అంతా ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు కరెంట్ బిల్లు చెల్లింపులు, మొబైల్ సిమ్‌కార్డుల రీచార్జి, బ్యాంకుకు వెళ్లకుండానే మనీ ట్రాన్స్‌ఫర్.. ఇలా ఏదైనా క్షణాల్లో చెల్లింపులు చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ చెల్లింపుల కాలంలోనూ ఆర్టీసీ మ్యానువల్‌గానే టికెట్లు ఇస్తూ వచ్చింది. ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి టికెట్ చెల్లింపులకు ఆన్‌లైన్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రస్తుతం లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ పద్ధతి అందుబాటులో ఉంది. త్వరలోనే ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా టికెట్ కోసం ఆన్‌లైన్ పేమెంట్ పద్ధతి అందుబాటులోకి తేనున్నారు. దీంతో ప్రయాణికులతోపాటు కండక్టర్లకు సైతం ఇబ్బందులు తీరనుండగా వేగవంత చెల్లింపులతో సమయాభావం తీరనుంది.

నిర్మల్ జిల్లాలో ఆర్టీసీ సమాచారం..

డిపో	ఆర్టీసీ బస్సులు	హైర్ బస్సులు
నిర్మల్	64	77
రోజువారీ ఆదాయం: రూ.20లక్షలకుపైగా (సరాసరి)		
భైంసా	33	49
రోజువారీ ఆదాయం: రూ.12లక్షలకుపైగా(సరాసరి)		

త్వరలోనే ఆన్‌లైన్ పేమెంట్ పద్ధతి..

ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సంస్థ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంది. త్వరలో అన్ని బస్సుల్లో క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ దిశగా సంస్థ నిర్ణయం చేస్తోంది. ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– సాలోమాన్ రాజ్, ఆర్‌ఎం, ఆదిలాబాద్

గోమయ గణపతిని పూజిద్దాం

- క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి

నిర్మల్‌టౌన్: పర్యావరణహితంగా ప్రకృతికి ఎలాంటి హానీ కలిగించని, గోమయ లేదా మట్టి గణపతులను పూజించాలని క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్య రెడ్డి సూచించారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్ కుమార్ హైదరాబాద్‌లోని వారి నివాసంలో గురువారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె గోమయ గణపతి ప్రతిమను అందజేశారు.

ఈ నెల 16, 17న గోమయ గణపతుల పంపిణీ

నిర్మల్ నియోజకవర్గంలో ఏటా క్లీమమ్ సంస్థ, ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత గోమయ గణపతులను పంపిణీ చేయనున్నట్లు అల్లోల గౌతంరెడ్డి, సేవ్ దేశీ కౌస్ క్యాంపెనర్, క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి తెలిపారు. ఎనిమిదేళ్లుగా పర్యావరణానికి హానీ చేయని విధంగా గోమయ, పసుపు, మట్టి, చింతగింజలు, వేపాకు మిశ్రమం, ఎండుగడ్డి ఉపయోగించి గణేశ్ ప్రతిమలను తయారు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వీటిని ఈ నెల 16,17 తేదీల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

'ఫస్ట్'కాదు.. ఫేక్‌లిస్ట్

- బీజేపీ అభ్యర్థులు వీరేనంటూ.. సోషల్ మీడియాలో వైరల్
- ఉమ్మడి జిల్లాలో పలువురి పేర్లు
- ఖండించిన బీజేపీ నాయకులు



వైరల్ అయిన ఫేక్ జాబితా

నిర్మల్: బీజేపీ అభ్యర్థులు తొలి జాబితా ఇదేనంటూ.. సోషల్ మీడియాలో పలువురు అభ్యర్థుల పేర్లతో వైరల్ అవుతోంది. ఇది పార్టీ ప్రకటించిన జాబితా కాదని, ఫేక్ లిస్ట్ అని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ జాబితాలో మొత్తం 11 నియోజకవర్గాలు–అభ్యర్థుల పేర్లు ఉండగా ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నియోజకవర్గాలే ఎక్కువగా ఉన్నాయి. నిర్మల్– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్–లాలా ఓంప్రకాశ్ జైస్వాల్, ఖానాపూర్(ఎస్టీ)–రాథోడ్ రమేశ్, బోథ్(ఎస్టీ)– సోయంబాపురావు, సిర్పూర్–పాల్వాయి హరీశ్‌బాబుల పేర్లు ఉన్నాయి. ఈ జాబితాను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. మిగితా నియోజకవర్గాలు కూడా అనుమానం రాకుండా ఉండేందుకు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఈటెల, కోమటిరెడ్డిల పేర్లు పెట్టారు. చాలామంది ఈ జాబితా వాస్తవమే అనుకుని, వారూ ఫార్వర్డ్ చేశారు. చివరకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోషల్ మీడియా ద్వారానే ఈ జాబితా పార్టీ ప్రకటన కాదని స్పష్టంచేశారు.

ఫేక్ ప్రచారాలు చేయొద్దు..

బీజేపీ అభ్యర్థులను ప్రకటించారంటూ సోషల్‌మీడియా ద్వారా నకిలీ ప్రచారాలను చేయొద్దని పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి కోరారు. సోషల్‌మీడియాలో గురువారం వైరల్ అయిన జాబితాపై ఆమె స్పందిస్తూ ఇది పూర్తిగా ఫేక్ అన్నారు. పార్టీ ఏ విషయాన్నైనా ప్రజలందరికీ తెలిసేలా ప్రకటిస్తుందన్నారు. ఇలాంటి నకిలీ ప్రచారాలతో ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.

సరిహద్దులో భయం భయం..

- ఝరి(బి) అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- మూడు మేకలు మృతి


చిరుత దాడిలో మృతిచెందిన మేక కళేబరం

తానూరు: మండలంలోని ఝరి(బి), బెంబర అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రం ఝరి(బి) గ్రామానికి చెందిన గుర్ల శ్రీనివాస్, బెంబర గ్రామానికి చెందిన నర్సు మేకల కాపారులు అటవీ ప్రాంతంలో మేకలను మేపేందుకు తీసుకెళ్లారు. సాయంత్రం సమయంలో గుర్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు మేకలు, బెంబర గ్రామానికి చెందిన నర్సుకు సంబంధించిన మేకపై చిరుత దాడి చేసి ఎత్తుకెళ్లింది. కాపరులు ఇంటికి వచ్చి చూసేసరికి మేకలు కనిపించలేదు. దీంతో కాపరులు గురువారం ఉదయం అటవీ ప్రాంతంలోకి వెళ్లి చూడగా మూడు మేకల కళేబరాలు కనిపించాయి. దీనిని గమనించిన కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు అటవీ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. మేకలపై దాడి చేసింది చిరుతపులేనని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ అధికారి మహేశ్‌ను వివరణ కోరగా గ్రామస్తులు తమకు ఆలస్యంగా సమాచారం అందించారని, శుక్రవారం అటవీ ప్రాంతానికి వెళ్లి చిరుత పాదముద్రలు పరిశీలిస్తామన్నారు.

భయంభయం..

ఝరి(బి), బెంబర గ్రామాలకు చెందిన అధిక మంది రైతుల వ్యవసాయ భూములు గుట్టప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. ఆ వైపునకు వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. పంట పొలాల్లో సోయా, పత్తి పంటలు ఏపుగా పెరగడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఆ గ్రామాల రైతులు జంకుతున్నారు. అధికారులు అటవీ ప్రాంతంలో పర్యటించి చిరుత ఆనవాళ్లను గుర్తించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా పోడుపట్టాలు పొందిన రైతులకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్థిక సహాయ పథకం, పంట రుణాలు మంజూరుపై గిరిజన సంక్షేమ, ఉమ్మడి జిల్లా బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన గిరిజన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలకు యూనిట్లను మంజూరు చేయడం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలు, బ్యాంకుల వారీగా లక్ష్యాలను చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, ఏఓ రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం


రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఖానాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపు మేరకు చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంలో భాగంగా పట్టణంలోని శ్రీలక్ష్మివేంకటేశ్వర ఆలయంలో హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం గురువారం ఘనంగా జరిగింది. అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామిజీ పాల్గొని భక్తులకు ఉపదేశించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకుని భక్తి మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ చేరుకున్న రథానికి స్థానిక భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు ఆలయంలో అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చక్రపాణి నర్సింహమూర్తి, రాజశేఖర్‌శర్మ, సందీప్‌శర్మ, నాయకులు మంత్రరాజం సురేశ్, శెట్టి శ్యామ్, అంకం రాజేందర్, కొక్కుల ప్రదీప్, మహాజన్ జితెందర్, మడిగెల గంగాధర్, పెరిక గంగాధర్, అడ్డగట్ల రాజన్న, కొండ సురేశ్, కట్కం శేఖరయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రభాకర్, అనిల్‌రావు, రాజు, చంద్రహాస్, పరమేశ్వర్‌గౌడ్, తదితరులున్నారు.

సమ్మె శిబిరంలో పొలాల అమావాస్య


ఆవుకు పూజ చేసి వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు


నిర్మల్‌రూరల్: తమ డిమాండ్ల సాధనకు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో గురువారం పొలాల అమావాస్య జరుపుకుని నిరసన తెలిపారు. ఉద్యోగులు తయారుచేసిన మట్టి జోడెద్దులకు పూజలు చేశారు. దీక్ష శిబిరం బయట ఆవుకు పూజలు నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పీఆర్టీ యూ లక్ష్మణచాంద, మామడ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టపల్లి నరసయ్య, పరమేశ్వర్, బచ్చు శ్రీనివాస్, సురేశ్‌కుమార్, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూమన్నయాదవ్, ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

- స్పష్టం చేసిన అంగన్‌వాడీ వర్కర్లు
- సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని అంగన్‌వాడీ వర్కర్లు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె శిబి రం నుంచి సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం ఎన్టీఆర్‌చౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ ఇప్పటికైనా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, ఉపాధ్యక్షులు లావణ్య, రమ్య, భాగ్య, హేమల త, నర్సమ్మ, భాగ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు పద్మ, హేమలత పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి


శృతి(ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన సోన్‌కాంబ్లే రాష్ట్రపాల్, సునీత దంపతులకు శృతి(8), దీక్షిత్, ప్రణీత్ సంతానం ఉన్నారు. శృతి మండల కేంద్రంలోని హోలీ ట్రినిటి చర్చ్‌లో రెండో తరగతి చదువుతోంది. శృతి వారంరోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించినా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో ఈ నెల 11న ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

చోరీకి పాల్పడిన దొంగల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పలు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు దొంగలను టూటౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ ఉన్నారు. ఎస్సై జీవి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. తాంసి బస్టాండ్ ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానంగా కనిపించిన ముగ్గురిని పట్టుకుని పట్టుకొని విచారించారు. వీరిలో రిక్షా కాలనీకి చెందిన సయ్యద్ ముష్రఫ్, వడ్డెర కాలనీకి చెందిన షేక్ బిలాల్, అదే కాలనీకి చెందిన మరో మైనర్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా వీరు ఇదివరకు నిజామాబాద్‌లో రెండు ద్విచక్ర వాహనాలు, రిక్షా కాలనీలో కెమెరా, వాచ్, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ, రిక్షా కాలనీల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిబిరంలో పాల్గొన్న జడ్జి జితిన్

ఖానాపూర్: పుట్టుకతో వచ్చిన సమస్యలతోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. ప్రపంచ చెవిటి దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జడ్జి హాజరై ప్రారంభించారు. కళ్లు, చెవులు, తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కామేష్, సిబ్బంది చంద్రకాంత్, జయలలిత, న్యాయవాదులు బాశెట్టి శివ, రాజలింగం, రాజశేఖర్, ఆసిఫ్ అలీ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్సై ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్సై అశోక్‌రావ్ ఇంట్లో గురువారం చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అశోక్‌రావ్ ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వెళ్లాడు. దర్శనం చేసుకుని ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా 16 తులాల బంగారం, రూ.లక్ష నగదు కాజేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళకు సినీ నటుడు ఆర్థిక సాయం


రూ.లక్ష చెక్కు అందిస్తున్న నటుడు విజయ్‌దేవరకొండ

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామానికి చెందిన పేద ఆదివాసీ మహిళ అత్రం పారుబాయికి గురువారం హైదరాబాద్‌లో నటుడు విజయ్‌దేవరకొండ తన నివాసగృహంలో రూ.లక్ష ఆర్థిక సాయంగా చెక్కును అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కోటి రూపాయల సాయం అందజేసినట్లు విజయదేవరకొండ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా సభ్యుడు నక్క గణేష్ తెలిపారు. ఇందులో భాగంగానే మల్యాల్ గ్రామానికి చెందిన అత్రం పారుబాయికి ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పాడు. పారుబాయి భర్త మరణంతో కూలీ పనులు చేసుకుంటూ తన నలుగురు కూతుర్లను పోషించుకుంటుంది. కార్యక్రమంలో మల్యాల్ సర్పంచ్ లావణ్యారాజు పాల్గొన్నారు.